ప్రజాశక్తి

మంగళవారం 7 నవంబర్ 2023

5

విజయనగరం

ఆర్‌టిసి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి అభివృద్ధి ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని ఎపిఎస్‌ఆర్‌టిసి బోర్డు సభ్యులు ఎ.రాజారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సును ఆయన సందర్శించారు. కార్గో కౌంటర్‌ను పరిశీలించారు. కార్గో ఆదాయం పెంచి, సంస్థ అభివృద్ధికి దోహద పడాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటుచేసి, కార్గో ఆదాయం పెంచుటకు సూచనలు, సలహాలు అడిగి తీసుకొన్నారు. కార్యక్రమంలో డిపిటిఒలు సిహెచ్.అప్పలనారాయణ, సుధాకర్, విజయనగరం జోన్ కమర్షియల్ అధికారి అప్పలనాయుడు, కమర్షియల్ ఎటిఎం హెచ్.దివ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్గో కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న రాజారెడ్డి

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు మేఘాలు కమ్ముకున్నాయి. నీరులేక వరిచేలు ఎండిపోవడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. గెడ్డల్లోను, చెరువుల్లోను ఉన్న నీటిని మోటార్లు ద్వారా పలుచోట్ల తోడుకుంటూ వరిచేలను బతికించు కునేందుకు రైతులు ప్రయత్నిస్తుండగా, మరికొన్ని చోట్ల పూర్తిగా ఎండిపోయిన వరిచేలను పశువుల మేతకు రైతుల వదిలేస్తున్నారు. ఈనేపథ్యంలో పలు మండలాల్లో కరువు పరిస్థితికి ఈ దుస్థితి అద్దం పడుతోంది.

మెరకముడిదాం మండలంలో వరిచేను ఎండిపోవడంతో పశువులను మేతకు విడిచిపెట్టిన రైతులు

కమ్ముకున్న కరువు మేఘాలు

తీవ్ర వర్షాభావంతో ఎండిపోయిన వరి ● పశువుల మేతగా వరిచేలు

ఎండిపోతున్న వరిపొలం

ప్రజాశక్తి -గుర్ల, మెరకముడిదాం

గుర్ల మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు వల్ల వరి పంట ఎండిపోతోంది. మండలంలో 9920 ఎకరాలలో వరిసాగైనట్లు అధికారులు చెబుతున్నారు. గడిగెడ్డ ఆయకట్టు పరిధిలో 2900 ఎకరాలకు సాగునీరు అందుతోంది. పొట్టదశకు చేరిన దశలో ఈ గెడ్డ ద్వారా 50శాతం మాత్రమే సాగునీరు అందుతోంది. గడిగెడ్డ ప్రాజెక్ట్ పరిధిలో కుడికాలువ కింద బూర్లిపేట, పల్లిగండ్రేడు, గరికివలస, గజపతినగరం మండలం కెంగువ, ఎడమ కాలువ కింద తెట్టంగి, గూడెం, పాలవలస, పున్నపురెడ్డి పేట గ్రామాలకు సాగునీరు అందాల్సి ఉంది. ప్రస్తుతం వర్షా భావ పరిస్థితుల దృష్ట్యా శివారు గ్రామాలకు సాగునీరు అందని ద్రాక్షగా ఉంది. ఇక వర్షాధారం తో సాగుచేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ప్రస్తుతం సాగునీరు లేక పంట ఎండిపోతోంది. అక్టోబర్‌లో సాధారణ వర్ష పాతం 180.7 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, 2.8 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పంటను కాపాడుకొనేందుకు రైతులు ఆయిల్ ఇంజన్లతో నీరు తోడు తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో నీరు తోడిన మరుసటిరోజుకే పదును అరిపోతుందని రైతులు అంటున్నారు. పంటను కాపాడుకునేందుకు రైతులు ఆయిల్ ఇంజన్లు, పైపులు కోసం పరుగులు తీయడంతో వాటి ధరలకూ రెక్కలు వచ్చాయని ఆవేదన చెందుతున్నారు..ఎన్ని ప్రయత్నాలు చేసినా వరిపంట చేతికి అందడం కష్టమే అని రైతులు అంటున్నారు.

మరోవైపు తోటపల్లి కాలువ నుంచి సాగునీరు అందకపోవడంతో వరి పంటకు ఇబ్బందిగా మారింది. అప్పులుచేసి పెట్టుబడి పెట్టిన పంట చేతికి అందక పోతే అప్పుల ఊబిలో కూరుకుపోతామని, ఈ నేపథ్యంలో మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు పంటల బీమా అందచేయాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలని అంటున్నారు.

పంట పశువుల పాలు

మెరకముడిదాం మండలంలో వరిపంటకు తీవ్రంగా నష్టం కలిగింది. వర్షా భావ పరిస్థితులతో పొట్ట దశలో పంట దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో 8,697 ఎకరాల్లో వరి పంట వేశారు. తీవ్ర వర్షాభావం, ఎండల తీవ్రత వల్ల వరి చేలు పూర్తిగా ఎండి పోవటంతో రైతులు పశువులను మేతకు వదిలి వేస్తున్నారు. ప్రస్తుతానికి మండలంలో సుమారు 3వేల ఎకరాలు వరకు తీవ్ర ంగా దెబ్బతింది. ఎక్కడో బోర్లు ఉన్న ప్రాంతంలో తప్ప, మిగతా చోట్ల నీరు లేక తీవ్ర కరువు వాటిల్లే అవకాశం ఉండటంతో పూర్తి స్థాయిలో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

గడిగెడ్డ నీరూ అందలేదు

నీరులేక వరి పంట ఎండిపోతుంది. వర్షాలు కురవక పోవడం, గడిగెడ్డనుండి శివారు గ్రామాలకు సాగునీరు అందకపోవడంతో వరి పంట దెబ్బతిన్నది. నేను ఎకరా పొలంలో వరి వేశాను. ఇప్పటివరకు సుమారుగా రూ.24 వేలు పెట్టుబడి పెట్టాను. పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- బి.అప్పలనాయుడు, రైతు, గూడెం గ్రామం, గుర్ల మండలం

తోటపల్లి నీరు రాలేదు

సకాలంలో వర్షాలు పడకపోవడంతో వరి పంట దెబ్బతింది, ప్రస్తుతం నీరు లేక పంట ఎండిపోతుంది. తోటపల్లి నీరు వస్తుందని ఆశించినా రాలేదు. నాయకులు, అధికారులు పట్టించుకోలేదు. నేను 3 ఎకరాలలో వరి వేశాను. నీటి ఎద్దడితో పంట ఎండిపోవడం ఒక పక్క, చీడ పురుగుల నుంచి పంటను రక్షించుకునేందుకు మరోవైపు ఇబ్బందులు పడుతున్నాం.

-రెల్లి రమణ, రైతు, పల్లిగండ్రేడు, గుర్ల మండలం

న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లో సంయుక్త కిసాన్ మోర్చాను చేర్చడంపై రైతులు భగ్గుమన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ, అక్రమంగా కేసులు బనాయించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎఫ్ఐఆర్‌లో సంయుక్త కిసాన్ మోర్చాను చేర్చడంపై జిల్లాలో సోమవారం పలుచోట్ల నిరసనలు చేపట్టారు. ఎఫ్ఐఆర్ కాపీలను ఎక్కడికక్కడ దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఎపి రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు ఖండించారు. అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు, వ్యకాస నాయకులు

భగ్గుమన్న రైతులు

కిసాన్ మోర్చాపై తప్పుడు ఆరోపణలపై ఆగ్రహం ● ఎఫ్ఐఆర్ కాపీలు దహనం

బొబ్బిలిలో ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి, బొబ్బిలిరూరల్, శృంగవరపుకోట

కేంద్రం తీరుకు నిరసనగా విజయనగరంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఎపి రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యాన రైతులు ఎఫ్ఐఆర్ కాపీలు దహనం చేశారు. అనంతరం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ప్రజలకు తెలియజేస్తున్న మీడియాపై, జర్నలిస్టులపై, మేధావులపై దేశద్రోహం కేసులు నమోదు చేయడం, రోజుల తరబడి బెయిల్ రాకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న రైతులను బెదిరించాలనే ఉద్దేశంతో ఎఫ్ఐఆర్ రైతు సంఘాలను చేర్చారని విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల గొంతు నొక్కే బిజెపి ప్రభుత్వాన్ని తరిమి కొట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని తెగేసిచెప్పారు. తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.శంకరరావు, నాయకులు రమణ, జగన్‌మోహన్, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి పట్టణంలోని కోరాడ వీధి కూడలిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఆధ్వర్యాన ఎఫ్ఐఆర్ కాపీలు దహనం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం న్యూస్ క్లిక్‌పై అక్రమంగా కేసు నమోదు చేయడమే కాక ఎఫ్ఐఆర్‌ఒ సంయుక్త కిసాన్ మోర్చాను చేర్చి, రైతుల పోరాటాలను అణగదొక్కాలని చూస్తోందని శంకరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.గౌరీ, జె.రామారావు, జి.శంకర్రావు, కార్మికులు పాల్గొన్నారు.

బొబ్బిలి మండలంలోని రంగరాయపురం గ్రామంలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఎస్.గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరును తూర్పారపట్టారు. కార్యక్రమంలో నాయకులు యు.భూషణ్, సిహెచ్.సత్యనారాయణ, కునుకు కృష్ణ, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట పట్టణంలో ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద సిఐటియు, ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ రైతు, ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్న న్యూస్ క్లిక్‌పై మోడీ ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను కూడా మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని ధ్వజమెత్తారు. న్యూస్ క్లిక్‌పై తప్పుడు కేసులను వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవుళ్ళు, కె.గోపి, ఎం.చందు, కుమార్, జి.నాయుడు, ఆర్.కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేస్తున్న నాయకులు, రైతులు

జెఎఎస్ శిబిరాలకు మంచి స్పందన

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు మంచి స్పందన లభించిందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మొత్తం 541 శిబిరాలు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటికే 517 పూర్తిచేశామని కలెక్టర్ నాగలక్ష్మి ముఖ్యమంత్రికి వివరించారు. 2.53 లక్షల మందికి శిబిరాల్లో వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక వైద్య నిపుణులతో తనిఖీలు నిర్వహించడం వల్ల మహిళలు, గర్భిణులు ఎంతగానో ప్రయోజనం పొందారని వివరించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు చికిత్స కోసం ఏవిధంగా సంప్రదించాలనే అంశంపై వారిలో అవగాహన ఏర్పడిందని కలెక్టర్ చెప్పారు. వీడియో కాన్ఫరెన్సులో డిఎంహెచ్ఒ భాస్కరరావు, డిసిహెచ్ఎస్ గౌరీశంకర్, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, సిపిఒ పి.బాలాజీ, జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ అప్పలరాజు, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెంటాడ మండలంలో సర్వే చేయించి దళితులు, గిరిజనుల భూములకు పట్టాలు ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ మెంటాడ మండలంలో సర్వేకు ప్రత్యేక బృందాన్ని కేటాయించి, వేగంగా సర్వే చేయించి పట్టాలివ్వాలన్నారు. ఫారెస్ట్ భూములకు జాయింట్ సర్వే చేసి, పట్టాలు ఇప్పించాలని కోరారు. భూములు పెత్తందారుల చేతుల్లోకి పోకుండా కాపాడాలన్నారు. అనంతరం జగనన్నకు చెబుదాంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు వినతి అందించారు. ధర్నాలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘం నాయకులు సోములు, పెదరాము, కృష్ణందొర, కృష్ణమూర్తి, జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు వెల్లువెత్తిన వినతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దొర, సుమబాల, ఇతర జిల్లా అధికారులు వినతులు స్వీకరించారు. ఈ వినతుల స్వీకరణ కార్యక్రమంలో సోమవారం 257 వినతులు అందాయి. అందులో రెవెన్యూకు సంబంధించి అత్యధికంగా 203 అర్జీలందాయి. గ్రామ వార్డు సచివాలయాల శాఖ 19, వైద్య ఆరోగ్యశాఖ 4, డిఆర్‌డిఎ 9, జిల్లా పంచాయతీ అధికారి 4, హౌసింగ్ 10, మున్సిపల్ 3, డిసిహెచ్ఎస్ 3 వినతులు వచ్చాయి. ఆయా వినతుల పరిష్కారం కోసం జెసి మయూర్ అశోక్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వినతుల్లో కొన్ని.. జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని టిడిపి, జనసేన నాయకులు వేర్వేరుగా వినతులు అందించారు. తీవ్ర వర్షాభావంతో రైతులు నష్టపోయారని, వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, గంటా పోలి నాయుడు, జనసేన నాయకులు లోకం మాధవి, గురాన అయ్యలు, మద్రాపు సురేష్ పాల్గొన్నారు. కరోనా సమయం నుంచి కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున అందించి రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చినట్లు ప్రకటిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం తరపున బియ్యం అందించాలని టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ వినతి అందించారు. గంట్యాడ మండలం కరకవలస గ్రామానికి చెందిన కొరువాడ అప్పారావు తన భూమిని ఆన్‌లైన్ చేయాలని వినతి సమర్పించారు.

జెసి మయూర్ అశోక్‌కు దళిత, గిరిజనుల భూముల పట్టాల సమస్యను వివరిస్తున్న వ్యకాస నాయకులు శ్రీనివాస్

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

విజయనగరం టౌన్ : అయ్యప్పనగర్ నుండి ప్రధానరహదారి పైకి వచ్చే చోట స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో నెలరోజుల్లో ముగ్గురు మరణించారని, వెంటనే స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుచేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన జాయింట్ కలెక్టర్‌కు వినతి అందించారు. స్పందించిన జెసి మున్సిపల్ అధికారులను పిలిచి.. అయ్యప్పనగర్, హనుమాన్ నగర్, పాలిటెక్నిక్ కాలేజీ వద్ద రెండు రోజుల్లో స్పీడ్ బ్రేకర్స్ వేయాలని ఆదేశించారు. అక్రమ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయాలని ఆ సంఘం నాయకులు కోరగా, ఇప్పటికే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు జెసి తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, అయ్యప్పనగర్ పోరాట కమిటీ కన్వీనర్ యుఎస్ రవికుమార్, కార్యదర్శి ఎస్.సుధీర్ పాల్గొన్నారు.

జిల్లా బాక్సింగ్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సీనియర్ బాక్సింగ్ స్త్రీ,పురుషులు జట్లు ఎంపిక స్థానిక రాజీవ్ స్టేడియంలో సోమవారం జరిగింది. 13 విభాగాల్లో 13 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 13 నుంచి 15 వరకు విశాఖపట్నం, స్వర్ణభారతి లో జరుగు రాష్ట్రస్థాయి సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మధకుమార్, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌ఇ రాజు , బాక్సింగ్ రింగ్ అఫిషియల్స్ వి. సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా వీర వాసరం జెడ్‌పి హైస్కూలు ఆవరణలో నిర్వహించిన 67వ అంతర్ జిల్లాలో యోగా టోర్నమెంట్‌లో విద్యార్థిని మజ్జి తన్షిక 3వ స్థానం సాధించింది. విజయనగరంలోని సెయింట్‌మేరీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తన్షిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యోగా సెంటరులో శిక్షణ పొందుతోంది. ఈనేపథ్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు సోమవారం యోగా సెంటర్‌లో తన్షికను అభినందించారు. యోగా గురువు సుందరశివరావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎయిర్‌పోర్టు నిర్మాణం

టెర్మినల్, పరిపాలన భవనాల పనులు ప్రారంభం ● మరోవైపు జోరుగా భూమి చదును

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఎల్అండ్‌టి సంస్థ ఈ పనులను వేగవంతం చేసింది. ఈ నెల ఒకటో తేదిన జిఎంఆర్ సంస్థల చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ఎయిర్‌పోర్టు పనులకు భూమిపూజ చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ నుంచి భూమిని చదును చేసే పనులు ప్రారంభించారు. ఈ భూముల్లో మిషన్లతో 90 మీటర్లు లోతు వరకు మట్టి పరీక్షలు విరివిగా చేస్తున్నారు. ప్రస్తుతం పరిపాలన భవనంతోపాటు టెర్మినల్ భవనం పనులు రెల్లిపేట గ్రామం వద్ద వేగవంతంగా జరుగుతున్నాయి. మరోవైపు జాతీయరహదారిపై ఉప్పాడపేట వద్దనున్న వంతెన నుంచి ఏకంగా గూడెపువలస వరకు వాహనాలు వెళ్లేందుకు మట్టిరోడ్డును కూడా చదును చేశారు. ఈ మార్గం నుంచి వాహనాలు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం జాతీయ రహదారి నుంచి గూడెపువలస వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండడంతో పెద్ద వాహనాలు, లారీలు వెళ్లేందుకు ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రోడ్డును కూడా సిద్ధం చేస్తున్నారు. ఎల్ అండ్ టి సంస్థ భూమిని చదును చేసేందుకు భారీ స్థాయిలో పొక్లెయినర్లు, జెసిబిలు, లారీలను ఏర్పాటు చేసింది. అలాగే ప్రహరీగోడ పనులు కూడా స్పీడుగా జరుగుతున్నాయి.



మిషనుతో మట్టి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

విమానాశ్రయం టెర్మినల్ నిర్మాణం కోసం చదును చేసిన భూమి

విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి జే జేలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాటం ప్రారంభించి వెయ్యిరోజులు అయిన సందర్భంగా ప్రజా సంఘాలు జేజేలు పలికాయి. కలెక్టరేట్ వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం ప్రజా ఉద్యమంగా, అన్ని ప్రజా సంఘాల ఉద్యమంగా నడుస్తోందని తెలిపారు. ఈ ఉద్యమం ఇతర అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని అన్నారు. కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్న న్యూస్ వార్తా ఛానల్‌పై మోడీ ప్రభుత్వం కక్షకట్టిందన్నారు. ప్రత్యేకించి సంయుక్త కిసాన్ మోర్చా నడిపిన రైతు ఐక్యఉద్యమానికి మద్దతుగా నిలబడిందన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను కూడా మోడీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి. లక్ష్మి, పట్టణ అధ్యక్షులు ఎ. జగన్మోహన్, కార్యదర్శి బి.రమణ, జిల్లా కార్యదర్శి యుఎస్ రవికుమార్, పట్టణ ఉపాధ్యక్షులు ఆర్.శంకర్ రావు, కె.త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో నీటి వనరుల లెక్కింపు

డిసెంబరులోగా రిఫరల్ కేసుల పూర్తి చేయాలి : జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

మాట్లాడుతున్న జెసి అశోక్

గ్రామాల్లో నీటి వనరుల లెక్కింపు ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇంజినీరింగ్ అధికారులు, ఎంఇఒలతో సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్, పంచాయితీరాజ్ భవనాలు, జగనన్నకు చెబుదాం, గృహ నిర్మాణం, నీటి వనరుల లెక్కింపు, సచివాలయాల వద్ద బోర్డులు ఏర్పాటు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సుమారు రెండున్నర లక్షలు పైగా వైద్య సేవలు పొందారని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం ఎంపిక చేసిన రిఫరల్ కేసులను పర్యవేక్షించి, డిసెంబరు లోగా వారికి వైద్య సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతీ ఒక్క కేసును సీరియస్‌గా తీసుకొని అవసరమైన వైద్యం అందించాలని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరిచేతా ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, రిజిష్టర్ అయ్యేలా చూడాలని సూచించారు. వాలంటీర్లు, ఎఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది దీనికి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సచివాలయం వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే 160 సచివాలయాలకు బోర్డులను పంపించామని, మిగతావి కూడా త్వరలో వస్తాయని చెప్పారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువులు, చెక్‌డ్యాములు తదితర నీటి వనరుల లెక్కింపు ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల వారీగా నీటి వనరులు, వాటి విస్తీర్ణం, లోతు, లభ్యమయ్యే నీరు, ఆయుకట్టు, తదితర అంశాలను, ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలని జెసి సూచించారు. విసిలో జిల్లా కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మున్సిపాలిటీలోని టిఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ మున్సిపల్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. మెనూ అమలు చేయకపోయినా, భోజనాల్లో నాణ్యత లోపించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఆయనతో టిపిఆర్‌ఒ జగన్మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ ఉన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

బొబ్బిలి : డిసెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ కోరారు. లోక్ అదాలత్‌పై డిఎస్‌పి శ్రీధర్, ఎక్సైజ్, ఎస్ఐ, పోలీసులతో సోమవారం సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రైలు ప్రమాద బాధితులకు పరామర్శ

కొత్తవలస : మండలంలోని దెందేరు గ్రామానికి చెందిన చింతల కృష్ణ ఇటీవల రైలు ప్రమాదంలో మరణించారు. సోమవారం ఆయన కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, బాలకృష్ణ, జగ్గారావు, లంక శ్రీను, వల్లప ఈశ్వరరావు, బోని తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి ఘన సన్మానం

శృంగవరపుకోట : వేపాడ మండల బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి శిరం సతీష్ శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వెళ్తున్నారు. దీంతో సోమవారం పట్టణంలోని ఇందుకూరి రిసార్ట్‌లో కొట్టం పిహెచ్‌సి వైద్యాధికారి హరిత ఆధ్వర్యంలో సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు.

రేపు విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల 8న చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సుధీర్, నాయకులు ఉన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

గజపతినగరం : ఈ నెల 8న చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రుద్రరాజు కోరారు. బంద్ పోస్టర్లను స్థానిక జూనియర్ కాలేజీ ఆవరణలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎన్.తాతినాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంబంగిని కలిసిన ఆర్‌డిఒ

బొబ్బిలి : ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుని ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన ఎ. సాయిశ్రీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఒను ఎమ్మెల్యే కోరారు. ఆమెతో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు ఉన్నారు.

ఇన్‌ఛార్జి ఎంఇఒగా నర్సింగరావు

వేపాడ : వేపాడ ఇన్‌చార్జి ఎంఇఒగా ఇన్నాళ్లు విధులు నిర్వహించిన శ్రీదేవి చీపురుపల్లి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇన్‌ఛార్జి ఎంఇఒగా ఎస్.కోట మండల విద్యాశాఖాధికారి నర్సింగరావును నియమించారు. దీంతో సోమవారం ఎంఇఒగా నర్సింగరావు బాధ్యతలు స్వీకరించారు.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరంకోట

గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకొని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పద్య పఠన పోటీలు నిర్వహించినట్లు సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 700 మందికిపైగా విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. న్యాయనిర్ణేతలుగా సోమేశ్వరరావు, జక్కు రామకృష్ణ, బి.కె.బాబూజీ, బి.విజయానిత్య, విప్లవం శ్రీలక్ష్మి, వివిఎస్.సుబ్బారావు, రాజేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో సూర్యలక్ష్మి, గురజాడ ఇందిర, సాహితి భరద్వాజ చక్రవర్తి, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి కళా ఇంట విషాదం

ప్రజాశక్తి - రేగిడి

మాజీమంత్రి కిమిడి కళా వెంకటరావు నాలుగవ సోదరుడు కిమిడి రామినాయుడు సతీమణి కిమిడి జయలక్ష్మి (72) సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో మృతి చెందారు. జయలక్ష్మి మృతి విషయాన్ని తెలుసుకుని మాజీ మంత్రి కళా వెంకటరావు, మాజీ జెడ్‌పిటిసి కిమిడి రామకృష్ణం నాయుడు, మాజీ ఎంపిపి కిమిడి వేణు సుందరం, మాజీ టిడిపి మండల అధ్యక్షుడు కిమిడి విజయ్ కుమార్, పార్టీ కార్యకర్తలు నాయకులు ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

స్విమ్మింగ్ పోటీలకు 'కంటోన్మెంట్' విద్యార్థులు

విజయనగరం టౌన్ : ఈ నెల 28 నుంచి 31 వరకు తిరుపతిలోని శ్రీనివాస కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలకు కంటోన్మెంట్ హైస్కూల్ విద్యార్థులు అండర్-17 విభాగంలో జి.సాకేత్, అండర్-14 విభాగంలో బి.తేజమణి ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం ఎం.కాంచన, పిడీ శేఖర్, పిఇటి ప్రమీల అభినందించారు.

నైపుణ్యంతో రాణించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలు ఉపాధి శిక్షణ ద్వారా మంచి నైపుణ్యంతో రాణించాలని మాజీ ఎమ్‌పి ఝాన్సీలక్ష్మి కోరారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో దీరా ఫౌండేషన్ సర్టిఫికెట్లను సోమవారం మంత్రి బొత్స సత్యనారాయణ నివాసంలో ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ హెచ్ ఆర్ కమలాకర్‌రెడ్డి, దీరా ఫౌండేషన్ సిఇఒ చక్రధర్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

భోగాపురం : మండలంలోని సవరవిల్లి గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన యువతి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తన కుమార్తె బుత్తల లక్ష్మి (19) శనివారం నుంచి కనబడటం లేదని తండ్రి పైడిరాజు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

కరువు మండలంగా ప్రకటించాలని వినతి

వేపాడ : వేపాడ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సోమవారం తహశీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి అందించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు బాగా దెబ్బతిన్నాయని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతల రమణ, కె.వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, టిడిపి నాయకులు

రూ.406 కోట్లతో అభివృద్ధి పనులు : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-మెంటాడ

మెంటాడ మండలంలో రూ.406 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని పోరాంలో ఆయన కేకు కట్ చేశారు. అనంతరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 8న సాలూరులో జరిగే వైసిపి సాధికార బస్సు యాత్రకు పోరాం నుండి బస్సులు, మోటార్ సైకిల్ ర్యాలీగా వెళ్తున్నట్లు తెలిపారు. అందుకు ఏర్పాట్లు చేయాలని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి లెంక సన్యాస అప్పలనాయుడు, నాయకులు రాయపల్లి రామారావుకు సూచించారు. కార్యక్రమంలో నారాయణమూర్తి, ఎమ్మెల్సీ సురేష్ బాబు. వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, కనిమెరక త్రినాథ్, పాశల ప్రసాద్, దాట్ల హనుమంత రాజు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ రామకృష్ణ, పి.అప్పలనాయుడు, మీసాల గురునాయుడు పాల్గొన్నారు.

ప్రజల తలరాతను మార్చిన పాదయాత్ర : ఎమ్మెల్యే

గజపతినగరం : ప్రజల తలరాతను మార్చిన పాదయాత్రకు నేటితో ఆరేళ్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. ఈ సందర్భంగా సోమవారం వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకును కట్ చేసి పార్టీ కార్యకర్తలతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల కష్టాలకు, అవసరాలకు అనుగుణంగా నవరత్నాలను రూపకల్పన చేసి అమలు చేశారని గుర్తు చేశారు. ఈనేపథ్యంలో ప్రజలు మరోసారి వైసిపికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం : ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యకు కేక్ తినిపిస్తున్న నాయకులు

పాదయాత్రకు ఆరేళ్లు.. వైసిపి సంబరాలు

మెంటాడ : సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజల సంతోషమే లక్ష్యంగా పాలన : కోలగట్ల

విజయనగరం టౌన్ : ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు కోలగట్ల నివాసంలో వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు అధ్యక్షతన కేక్ కట్ చేశారు. పాదయాత్రలో సిఎం జగన్ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా హామీలిచ్చారని కోలగట్ల తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, ఎంపిపి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆశయ సాధనకు కృషి

బొబ్బిలి : రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ ఆశయ సాధనకు పని చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని అమ్మిగారి కోనేరుగట్టు వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గొల్లపల్లిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం : శంబంగి

ప్రజాశక్తి-రామభద్రపురం

గిరిజన ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. సోమవారం రావివలసలో నూతనంగా నిర్మించిన పాఠశాల తరగతి భవనాన్ని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మెరుగైన విద్యా బోధనతో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం మల్లు గ్రామంలో పర్యటించారు. అక్కడి గిరిజనులతో మమేకమై ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను గిరిజనులు కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, ఎంఇఒ తిరుమల ప్రసాద్, సర్పంచ్ కుమారి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, మండల జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని దారగంగమ్మ లోవ నుండి రేగ పుణ్యగిరి కొండమీదకి నిర్మించబోయే సి.సి రోడ్డు, మెట్లు నిర్మాణానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల శంకర్ ఐ ఫౌండేషన్ అండ్ వాసవి క్లబ్, ఎస్.కోట ఆధ్వర్యంలో జరిగిన మెగా కంటి చికిత్సలో ఆపరేషన్ చేయించుకున్న పేదవారికి సుబ్బిరామి రెడ్డి కళ్యాణ మండపం వద్ద జరిగిన కార్యక్రమం లో కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ జి.సంతోషి కుమారి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొలమరశెట్టి రామకృష్ణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మహిళల చేతిలో రక్షణ చక్రం 'దిశ'

ప్రజాశక్తి-విజయనగరం

మహిళల చేతిలో రక్షణ చక్రం దిశా (ఎస్ఒఎస్) యాప్ అని జిల్లా ఎస్‌పి ఎం.దీపిక అన్నారు. ప్రతీ మహిళ తమకు రక్షణగా నిలిచే చట్టాలు గురించి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థులకు, వారికి రక్షణగా ఉండే చట్టాలు, ఆపద సమయంలో పోలీసుల సహాయం పొందే విధానం, దిశా యాప్ ను వినియోగించి రక్షణ పొందడం పట్ల అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుశాఖ తరుపున చర్యలు చేపడుతున్నామన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, మహిళా పోలీసులు, మహిళా రక్షక్, ఇతర పోలీసు సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టి దిశా యాప్‌పై అవగాహన కల్పించారు. విద్యాసంస్థలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్ లను సందర్శించి మహిళల రక్షణకు బాసటగా నిలిచే దిశ యాప్ పట్ల అవగాహన కల్పించారు. దిశా ఎస్ఒఎస్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోను డిలీట్ చెయ్యవద్దని కోరారు. ఏ కారణంతో నైనా డిలిట్ చేస్తే, వారు ఆపద సమయంలో ఉన్నపుడు పోలీసుల సహాయం పొందే వెసులుబాటును కోల్పోతారని వివరించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో 14,236 మందితో దిశ ఎస్ఒఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించినట్లు ఎస్‌పి తెలిపారు.

స్పందనకు 45 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 45 మంది తమ సమస్యలపై ఎస్‌పి ఎం.దీపికకు ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి ఎస్‌పి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియోకాన్ఫరెన్సులో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐ ఇ.నర్సింహమూర్తి, డిసిఆర్‌బి ఎస్ఐలు వాసుదేవ్, ప్రభావతి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే దిశ

బొబ్బిలి : మహిళల రక్షణ కోసమే ప్రభుత్వం దిశ చట్టాన్ని, యాప్‌ను తీసుకొచ్చిందని ఎస్ఐ సత్యనారాయణ, ఎఎస్ఐలు జి.భాస్కరరావు, స్వామి, సన్యాసిరావు అన్నారు. దిశ చట్టం, యాప్‌పై పట్టణంలో నాలుగు టీములుగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల మొబైళ్లలో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. ఆపదలో ఉన్నవారు దిశ యాప్‌ను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం : విద్యార్థినులతో దిశా యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న వన్‌టౌన్ ఎస్ఐ

దిశ యాప్‌తో మహిళలకు ప్రత్యేక రక్షణ

భోగాపురం : దిశ యాప్ మహిళలకు ఎంతో రక్షణగా ఉంటుందని భోగాపురం ఎస్ఐ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక లెండి కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ యాప్ అత్యవసర సమయాల్లో మహిళలకు ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు. గ్రామాలతో పాటు జంక్షన్ల వద్ద పోలీస్ సిబ్బందితో పాటు మహిళా పోలీసులు కలిసి ఉమ్మడిగా మహిళలతో ఈ యాప్‌ని డౌన్‌లోడ్ చేసి ఎలా వాడాలో అవగాహన కల్పించారు. సుమారు వెయ్యి మందితో యాప్‌ను డౌన్‌లోడు చేయించినట్లు తెలిపారు.

దిశ యాప్ పై యువతకు అవగాహన

రేగిడి : ఉంగరాడ మెట్ట వద్ద ఎస్ఐ ఇ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం దిశ యాప్ పై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. దిశ యాప్‌తో ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రమాదంలో ఉన్న మహిళలు ఈ యాప్ ద్వారా క్షణాలలో రక్షణ పొందవచ్చు అని చెప్పారు. గ్రామాల్లో, ప్రధాన రహదారుల్లో దిశ యాప్ పై విస్తృతంగా ప్రజలను, యువతను చైతన్యవంతులు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎటిఎల్ ల్యాబ్‌ల పరిశీలన

ప్రజాశక్తి- డెంకాడ, భోగాపురం

మండలంలోని అక్కివరం ఆదర్శ పాఠశాలలో రాష్ట్ర టాస్క్ ఫోర్స్ బృందం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారి ఆర్‌వి రమణ ల్యాబ్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులు అప్‌డేట్‌గా ఉన్నందుకు ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు ఐఎఫ్‌పి, ట్యాబ్, ప్రాజెక్టు వంటి టెక్నాలజీతో బోధించాలన్నారు. ఈ పరిశీలనలో డిఎస్ఒ వై. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య, ఉపాధ్యాయ బృందం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భోగాపురంలోని జెడ్‌పి హైస్కూలును టాస్క్‌ఫోర్సు బృందం సందర్శించి అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించింది. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో హెచ్‌ఎంతో పాటు సైన్సు ఉపాధ్యాయుడిపై టీమ్ సభ్యులు అగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌లను సక్రమంగా వినియోగించాలని సూచించారు. బృందం వెంట హెచ్‌ఎం శ్రీనివాసరావు, సైన్సు ఉపాధ్యాయులు ఉన్నారు.

బోగస్ ఓట్లపై దృష్టి పెట్టండి

మాజీ ఎమ్మెల్యే తెంటు

ప్రజాశక్తి-తెర్లాం

వైసిపి ప్రభుత్వం ఓటమి భయంతో బోగస్ ఓట్ల చేర్పులకు తెరలేపిందని, దీనిపై టిడిపి నాయకులు, కార్యకర్తలు దృష్టిపెట్టాలని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సూచించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మండల, గ్రామ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు మండల ఓటర్ పర్యవేక్షకులు సుంకరి సాయి రమేష్ మాట్లాడారు. వివిధ కారణాలతో టిడిపి సానుభూతిపరుల ఓట్లను దొంగతనంగా తొలగిస్తున్నారని తెలిపారు. ప్రతి క్లస్టర్ ఇన్‌ఛార్జి, బూత్ ఏజెంట్, నాయకులతో కలిసి ఓటర్ జాబితాను పరిశీలించి, బోగస్ ఓట్లు తొలగించాలన్నారు. టిడిపి సానుభూతిపరుల ఓట్లు చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, మాజీ ఎంపిపి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు యుగంధర్, శంకరరావు, కరణం రమేష్ పాల్గొన్నారు.

తంగుడుబిల్లి వద్ద ఆర్‌టిసి బస్సు ఆపాలి

విద్యార్థుల ఆందోళన

రహదారిపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లి వద్ద ఆర్‌టిసి బస్సు ఆపాలని గ్రామస్థులు కోరుతున్నారు. సోమవారం తంగుడు బిల్లి జంక్షన్ వద్ద ఆర్‌టిసి బస్సు ఆపాలని కోరుతూ ఎంపిటిసి చందక చిన్నం నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రయాణికులు, యువత ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి చందక చిన్నం నాయుడు మాట్లాడుతూ నిత్యం తంగుడుబిల్లి నుంచి విద్యార్థులు, ప్రయాణికులు 100మందికి పైగా విజయనగరం వెళ్తారని ఆ సమయంలో బొప్పడాం నుంచి విజయనగరం వెళ్లే ఆర్‌టిసి బస్ ఆపకుండా వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే బస్‌లో ఇతర గ్రామాల ప్రజలు ఉండడంతో ఆపడం లేదన్నారు. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడి కళాశాలలకు, ఇతర పనులకు వెళ్లకుండా ఉండిపోతున్నారన్నారు. సతివాడ నుంచి తంగుడు బిల్లి మీదుగా ఆర్‌టిసి బస్సు వేసి విద్యార్థులు, ప్రయాణికులు కష్టాలను తీర్చాలని ప్రస్తుతం తిరుగుతున్న బస్సును తంగుడుబిల్లి జంక్షన్ వద్ద కచ్చితంగా ఆపాలని కోరారు. అనంతరం ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, డిపో మేనేజర్, ఇతర అధికార్లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యుల హాజరు తక్కువ.. అధికారుల ఆర్భాటం ఎక్కువ

ప్రజాశక్తి- మెంటాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల బడ్జెట్ సమావేశంలో సభ్యులు హాజరు తక్కువ, అధికారుల ఆర్భాటం, హడావుడి ఎక్కువగా కనిపించాయి. మండలంలో 13 మంది సభ్యులు ఉన్నారు. నలుగురు ఎంపిటిసిలు, వైస్ ఎంపిపి, ఎంపిపి మినహా మిగతా సభ్యులు హాజరు కాలేదు. సగానికి పైగా సభ్యులు హాజరు కాకపోవడం అధికారుల వైఫల్యమని చెప్పుకోవచ్చు. ఈ సమావేశంలో అధికారులు తమ ప్రగతి నివేదికలను సభ్యులకు చెప్పి మమా అనిపించారు. ఏదేమైనా బడ్జెట్ సమావేశం తూ.తూ మంత్రంగా పూర్తి చేశారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, తహశీల్దార్ టి.రామకృష్ణ, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, హౌసింగ్ ఎఇ డేవిడ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని సోమవారం విశాఖలోని ఆయన నివాసం వద్ద శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఆయన సతీమణి డాక్టర్ మధు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎస్.కోటలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం కావడంతో శృంగవరపుకోట ప్రజలకు సిఎం జగన్ మోహన్ రెడ్డి మీద ఉన్న అభిమానం మరోసారి నిరూపితమైందని ఆయన అన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో విజయం కోసం ఆశీస్సులు తీసుకున్నామని చెప్పారు.

బాబుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- మెంటాడ

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వల్లే సాధ్యమని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి అన్నారు. సోమవారం మండలంలోని ఆగూరు పంచాయతీ రెల్లిగూడెంలో 'బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్‌తో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. బస్సుయాత్రకు జనాలు లేక మంత్రులు తలలు పట్టుకుంటున్నారని అన్నారు. ప్రజా వ్యతిరేకత మొదలైందని ప్రజాగ్రహానికి వైసిపి గురికాక తప్పదని హెచ్చరించారు. చింతలవలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బవిరెడ్డి కృష్ణ, వార్డు సభ్యులు బవిరెడ్డి ప్రకాశ్, , రెల్లిగూడెంలో పలువురు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, గెద్ద అన్నవరం, ముసలి నాయుడు, రెడ్డి ఆదినారాయణ, రెడ్డి సత్యనారాయణ, పల్లి సింహాద్రి, అనిల్, కాశీ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Hon'ble Addl. Senior Civil Judge, Eluru, W.G.Dist.,
I.A. No. /2023 in
I.P. No. 2/2023

Between:
Donka Venkateswara Rao
...Petitioner
Terrala Nageswara Rao & Others
...Respondents

To:
R-4: పై నంబరు గ్రంథంలో
Sarika Kalyan, S/o. Sattibabu, R/o. Chandana Brothers Gold Shop, Eluru, Presently Residing at Chinta Valasa, Vijayanagaram, Vijayanagaram Dist.

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 28-11-2023 ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల తమ పరోక్షమున సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జుజ్జవరపు ప్రసాద్
అడ్వకేట్, ఏలూరు
సెల్: 90002 66396

సచివాలయాల పనితీరు బాధ్యత డిడిఒలదే

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సచివాలయాల వ్యవస్థ పనితీరు బాధ్యత డిడిఒలదేనని ఎంపిడిఒ శ్యామల కుమారి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల్లో అన్ని శాఖల సిబ్బందితో మమేకమై ప్రజలకు జవాబిదారితనంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలపై వచ్చిన అర్జీదారుల పట్ల మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలు ఇప్పటికే మూలకు చేరాయని, వాటిని పునరుద్ధరించి నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. కొన్ని గ్రామ పంచాయతీలలో సంపద సృష్టి కేంద్రాలు ప్రారంభించకపో వడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు హేమ సుందర్ రావు, గోపాల్ నాయుడు ఉన్నారు.

బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులుగా వంగపండు

బొబ్బిలి :బిసి సంక్షేమ సంఘం బొబ్బిలి నియోజకవర్గ అధ్యక్షులుగా వంగపండు శ్రీరాములునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయనగరంలో జరిగిన సమావేశంలో తనను నియోజకవర్గ అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు శ్రీరాములునాయుడు చెప్పారు. బిసిల సంక్షేమానికి, బిసిల సమస్యలు పరిష్కారానికి పని చేస్తామని చెప్పారు.

ఓటరు జాబితాను పరిశీలించాలి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని టిడిపి నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఓటర్ల జాబితాను పరిశీలించాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో సూచించారు. మండలంలో ఇప్పటివరకూ పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమాలు ఒకెత్తయితే, ఇప్పటి నుంచి చేపట్టే కార్యక్రమాలు మరో ఎత్తని తెలిపారు. ప్రస్తుతం ఓటర్ల నమోదులో వైసిపి వారికి అనుకూలంగా గ్రామస్థాయిలో ఓట్లు చేర్పించే కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి గ్రామంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పరిశీలించి, వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. ఓటర్ల నమోదు వద్ద గ్రామ వాలంటీర్లు పాల్గొంటే వెంటనే తనకు తెలియజేయాలని సూచించారు. ఓటరు నమోదులో అక్రమాలు జరగకుండా నిరోధించాలని కోరారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్, 3 లాంతర్ సెంటర్, విజయనగరం.ఫోన్ :80746 56196

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-11-2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1432.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8074656196